క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని బాచుపల్లి సబ్‌స్టేషన్ ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలియజేశారు. వోల్వో ఫీడర్ పరిధిలోని సాయిఅనురాగ్ కాలనీ, కావ్య ఎవెన్యూలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు...

- వికాస్ ఫీడర్ పరిధిలోని వికాస్ పబ్లిక్ స్కూల్ ఏరియా, సూర్య స్కూల్, ఎస్ఆర్ఐ స్కూల్, విష్ణుకృపా డెవలపర్స్, టిక్నో పోలీస్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

కరోనా లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించుకోండి

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్–19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం సూరారం కాలనీలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో 22 మందికి కరోనా పరీక్షలు చేయగా అందరికి నెగిటివ్ రిపోర్ట్‌లు వచ్చినట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు. కరోనా లక్షణాలు ఉంటే వెంటనే దగ్గరలోని దవాఖానాల్లో కోవిడ్–19 నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

మీ-సేవ నిర్వాహకులతో అత్యవసర సమావేశం



మీసేవ నిర్వాహకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సంజీవరావు

సుభాష్‌నగర్: ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణలో భాగంగా 59 జీవో విషయమై కుత్బుల్లాపూర్ తహసీల్దార్ సంజీవరావు మంగళవారం మీసేవ నిర్వాహకులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఇటీవల 59 జీవో కింద డిమాండ్ నోటీసులు అందుకున్న లబ్ధిదారులకు మీసేవ ద్వారా జనరేట్ చేయించుకుని అనంతరం బ్యాంకుకు చలానా ద్వారా రుసుము చెల్లించాలన్నారు. ఈ విషయమై లబ్ధిదారులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత మీసేవ నిర్వాహకులపై ఉందన్నారు.

'వడ్డెర కులస్తులకు అండగా ఉంటా'



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న మహేష్

సుభాష్‌నగర్: ఆర్థికంగా వెనుకబడిన వడ్డెర కులస్తులకు అండగా ఉంటానని మేడ్చల్ జిల్లా వడ్డెర యువజన సంఘం అధ్యక్షుడు మహేష్ అన్నారు. కాప్రా మండలం జవహర్‌నగర్‌లోని బీజేఆర్‌నగర్‌లో ఇటీవల పీతల శ్రీదేవి రోడ్డు ప్రమాదంలో చనిపోయింది. విషయం తెలుసుకున్న మహేష్ సోమవారం రాత్రి గాజులరామారంలో శ్రీదేవి తల్లి వెంకటమ్మకు రూ.50వేల ఆర్థిక సాయం అందించారు. విజయ్ ముదిరాజ్, చిన్న, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా వనిత డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

చింతల్: చింతల్ వనిత డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే మంగళవారం బాల్‌రెడ్డినగర్‌లోని సురేందర్ రెడ్డి గార్డెన్స్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాశాల కరస్పాండెంట్ డా. నరేష్ మాట్లాడుతూ... తమ కళాశాల విద్యార్థులకు ఎంఎన్‌సీ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తూ వారి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ మౌనిక, డైరెక్టర్లు కావ్య, హరికృష్ణ, ప్రిన్సిపల్ రాజయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ గ్రామంలోని శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. మంగళవారం టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కేఎం ప్రతాప్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ దర్మకర్త ఠాగూర్ విజయేందర్‌సింగ్ ఆధ్వర్యంలో ప్రతాప్‌ను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పెద్ది మల్లేశం, రత్నం, మురళిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సెటిల్‌మెంట్ దందా!

ఎక్స్‌టెన్షన్ పేరిట హద్దు అదుపు లేకుండా నిర్మాణాలు

- రెండో వైపు కట్టుకోవడానికి లక్షల్లో వసూలు చేస్తున్న వైనం
- రాజీవ్ గృహకల్పలో కొనసాగుతున్న దందా
- కాంట్రాక్టర్‌గా అవతారమెత్తిన గృహకల్ప మాజీ అధ్యక్షుడు
- నోటీసుల గడువు ముగిసిన వెంటనే చర్యలు: టౌన్‌ప్లానింగ్ అధికారి



రాజీవ్‌గృహకల్ప 37బ్లాక్ వద్ద రెండవ వైపు నిర్మాణం



రాజీవ్ గృహకల్ప రేషన్ షాపు సమీపంలో..



23వ బ్లాక్ వద్ద రోడ్డు పైకి వచ్చిన నిర్మాణం

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్పలో ఎక్స్‌టెన్షన్ పేరిట కడుతున్న అక్రమ కట్టడాలకు హద్దు అదుపు లేకుండా పోతోంది. మూడు సంవత్సరాల నుంచి కొనసాగుతున్న ఈ నిర్మాణాల విషయంలో హౌసింగ్, రెవెన్యు, టౌన్ ప్లానింగ్, ఫారెస్ట్ అధికారులు కూడా సందర్శించారు. కాని ఈ కట్టడాలు మాత్రం ఆపలేకపోయారు. ఇటీవలే ఈ ఆదనపు గదుల నిర్మాణాలకు తోడు ఈ సముదాయంలో ఖాళీగా ఉన్న స్థలాల్లో డబ్బాలు కూడా ఏర్పాటు చేసి కబ్జా చేస్తున్నారు. ఈ విషయమై ఆర్ఐ పరమేశ్వర్‌రెడ్డి డబ్బాలను తొలగించే సమయంలో స్థానికంగా పలువురు దాడి చేయడానికి ప్రయత్నించగా, చివరకు పోలీస్ బలగాల సహాయం తీసుకోవాల్సి వచ్చింది. ఈ దాడికి ప్రయత్నించిన వారిపై కేసు కూడా నమోదు చేశారు.

- ఇక ఎక్స్‌టెన్షన్ పేరిట ఇప్పుడున్న గదులకు ఆనుకుని మరో 8–15 ఫీట్లతో కొన్ని బ్లాక్ లలో పనులు పూర్తి చేశారు. అది కాక ఇదే బ్లాక్‌లకు చెందిన వారు మరోవైపు కూడా కట్టుకోవడానికి ప్రయత్నిస్తున్న వారి నుంచి డబ్బులు వసూలు చేసి సెటిల్‌మెంట్‌లు చేస్తున్నారు. 37వ బ్లాక్ వద్ద ఇటీవలే రెండోవైపు కట్టుకోవడానికి సుమారు రూ.6 లక్షలకు ఒప్పందం కుదిరినట్లు సమాచారం. ఈ డబ్బులలో స్థానికంగా ఉన్న మాజీ అధ్యక్ష, కార్యదర్శులు, చోటా మోటా నాయకులు అందరు పాలు పంచుకున్నట్లు భోగట్టా.
- అదే విధంగా రేషన్‌షాపు సమీపంలో గృహకల్ప స్థలమంటూ ఒకరు, కూన మహాలక్ష్మినగర్‌కు చెందినదని, తాము ఇంతకు ముందే స్థలం కొన్నామని మరొకరు వాదోపవాదాలు చేసుకున్నారు. చివరకు ఇదీ కూడా రూ.2 లక్షలకు 'సెటిల్'మెంట్ చేసుకున్నారని తెలిసింది.
- ఇక 23వ బ్లాక్ వద్ద నిర్మిస్తున్న కట్టడాలు ప్రధాన రోడ్డులోకి రావడం వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విచిత్రం ఏమిటంటే ఈ గృహకల్ప మాజీ అధ్యక్షులు ఇప్పుడు కాంట్రాక్టర్‌గా అవతారమెత్తి ఈ కట్టడాలు చేపట్టడం విడ్డూరం.
- ఇటీవలే ఈ గృహకల్ప అక్రమ కట్టడాలపై సాక్షిలో కథనం ప్రచురితం కాగా టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలను పరిశీలించి నోటీసులు అందజేశారు. ఈ విషయమై 'సాక్షి' టౌన్ ప్లానింగ్ అధికారి సంగీతను వివరణ కోరగా నోటీసుల గడువు ముగిసిన వెంటనే అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపడతామని తెలిపారు.

ప్రతి మంగళవారం
కట్టమైసమ్మ ఆలయంలో అన్నదానం



కొలువుదీరిన కట్టమైసమ్మ



అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్‌లోని శ్రీ కట్టమైసమ్మ ఆలయం వద్ద ప్రతి మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మొదటివారం త్రిశూల్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం ఒంటి గంటలకు ప్రారంభమైన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. వివేక్‌రెడ్డి, శైలజరెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. 42 సంవత్సరాలుగా ఇక్కడ ఈ కార్యక్రమం కొనసాగుతోందని ఆలయ కమిటీ ప్రతినిధి వివేక్‌రెడ్డి పేర్కొన్నారు. మూడు నెలల పాటు ప్రతి మంగళవారం అన్నదానం నిర్వహిస్తామని తెలిపారు. అన్నదానం చేసేందుకు భక్తులు తమ పేర్లను నమోదు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం స్థానికంగా షెడ్డు ఏర్పాటు చేసి భక్తులకు అన్నదానం చేస్తున్నామని తెలిపారు.

ఘనంగా రమాబాయి అంబేడ్కర్ జయంతి



రమాబాయి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

కుత్బుల్లాపూర్: రమాబాయి అంబేడ్కర్ జయంతిని మంగళవారం సూరారం న్యూ శివాలయనగర్‌లోని బీఆర్ అంబేడ్కర్ బాబూజగ్జీవన్‌రామ్ భవనంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, దళిత సంఘాల ఐక్య వేదిక కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రమాబాయి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ.. కొలంబియా యూనివర్సిటీలో బీఆర్ అంబేడ్కర్ చదువుకునే రోజుల్లో రమాబాయి అంబేడ్కర్ ఒకపూట తిండి తిని డబ్బులు పోగుచేసి మనీ ఆర్డర్ పంపేవారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో దళిత సేన జాతీయ నాయకుడు అవిజె జెమ్స్, ప్రేమ్ కుమార్, యాదగిరిమాదిగ, రవిమాదిగ, రత్నం, చైతన్య, సాంబ, రాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి 6.57శాతం
నిధులు కేటాయించడం అన్యాయం

ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్

నిజాంపేట్: తెలంగాణ బడ్జెట్‌లో విద్యాభివృద్ధికి కేవలం 6.57 శాతం నిధులను కేటాయించడం అన్యాయమని ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్ అన్నారు. మంగళవారం బాచుపల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్‌లో 16,092 కోట్లు ప్రాథమిక విద్యకు, రూ.3001 కోట్లు ఉన్నత విద్యకు ఎంత వరకు సరిపోతాయని ప్రశ్నించారు. కేవలం కొన్ని గురుకులాలను చూపించి ఇదే మన విద్యావృద్ధి అని ప్రభుత్వం చెబుతోందన్నారు. రెండు సంవత్సరాలుగా 3,500కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. మన ఊరు – మనబడి పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ప్రభుత్వాలు విద్యాభివృద్ధికి బడ్జెట్‌లో 17% కేటాయిపులు జరిగేవని గుర్తు చేశారు. గతేడాది రాష్ట్ర ప్రభుత్వ కేటాయింపులు 7.30 శాతం ఉంటే నేడు 6.57కు తగ్గించిందని వాపోయారు. కొఠారి కమిషన్ అభిప్రాయం ప్రకారం ఖచ్చితంగా మొత్తం బడ్జెట్‌లో 30 శాతం నిధులు విద్యకు కేటాయించాలని గుర్తు చేశారు. ఆ వైపుగా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ సవరణలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

ముస్లిం శ్మశానవాటిక పనులు త్వరగా పూర్తిచేస్తాం

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండలోని ముస్లిం శ్మశానవాటికలో రూ.1.5కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ప్రస్తుతం ముస్లిం శ్మశానవాటిక ముఖద్వారం, ప్రార్థన హాలు నిర్మాణ దశలో ఉన్నాయని కార్పొరేటర్ తెలిపారు. ఈ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. అలాగే సుందరీకరణ పనులన్నీ నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని కాంట్రాక్టర్, అధికారులకు సూచించారు. అనిల్‌రెడ్డి, షౌకత్ ఆలీ మున్నా, వాసుదేవరావు, పెద్ద ఖాజా, యాదగిరి, ఖాజా, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్ విఫలయత్నం

జీడిమెట్ల: గృహిణి మెడలోంచి బంగారు గొలుసును తస్కరించడానికి యత్నించిన స్నాచర్ ఆమె ప్రతిఘటించడంతో గొలుసు వదిలి పారిపోయాడు. ఈ ఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం డివిజన్ కళావతినగర్‌కు చెందిన దేవి(23) కాజీపల్లిలోని ఓ పరిశ్రమలో పనిచేస్తుంది. ఈరోజు సాయంత్రం 7గంటలకు కంపెనీ బస్సులో వచ్చిన దేవి జీడిమెట్లలో బస్సు దిగి నడుచుకుంటూ కళావతినగర్ వైపు వెళ్తోంది. ఈ క్రమంలో వెనక నుంచి వచ్చిన ఓ వ్యక్తి దేవి మెడలోని బంగారు గొలుసు తెంచుతుండగా దేవి క్షణాల్లో తేరుకుని అరుస్తూ ప్రతిఘటించి స్నాచర్‌ను పట్టుకునేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో సదరు స్నాచర్ గొలుసును అక్కడే పడేసి సిద్ధంగా ఉన్న మరో వ్యక్తితో ద్విచక్ర వాహనంపై వెళ్లిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాల ఆధారంగా దొంగలను పట్టుకుంటామని సీఐ పవన్ తెలిపారు.

క్రైం కార్నర్..

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి అదృశ్యం

కుత్బుల్లాపూర్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డికి చెందిన ఆంజనేయులు కుమారుడు ప్రణయ్‌కుమార్ ఐదేళ్లుగా తన భార్యతో కలిసి కుత్బుల్లాపూర్ పరిధి రాఘవేంద్రకాలనీలో ఉంటున్నాడు. కాగా నెల రోజుల క్రితం భార్యాభర్తల మధ్య విభేదాలు రావడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఈనెల 6న రాత్రి 8 గంటలకు తన తండ్రికి ఫోన్ చేసిన ప్రణయ్‌కుమార్ ఆల్వాల్‌లో ఉంటున్న చెల్లెలు ప్రత్యుష ఇంటికి వెళ్తున్నానని చెప్పాడు. అదేరోజు రాత్రి 8.30 గంటలకు ఇదే విషయమై ఆంజనేయులు తన కుమార్తెకు ఫోన్ చేయగా అన్నయ్య రాలేదని చెప్పింది. దీంతో కంగారు పడిన కుటుంబ సభ్యులు రాఘవేంద్రకాలనీలోని ఇంటికి వెళ్ల చూడగా తాళం వేసి ఉంది. అతని కోసం చుట్టు పక్కల, బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వాకబు చేసినా ఫలితం లేకుండాపోయింది. మంగళవారం ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విశ్వకర్మ కాలనీలో..



హరీష్‌రెడ్డి (ఫైల్)

కుత్బుల్లాపూర్: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు అదృశ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం విశ్వకర్మ కాలనీకి చెందిన ప్రభాకర్‌రెడ్డి భాగ్యలక్ష్మికాలనీలోని శ్రీవంశీ ఇండస్ట్రియల్ ప్రొడక్ట్స్ కంపెనీలో పని చేస్తున్నాడు. అతనికి కుమారుడు హరీష్‌రెడ్డి (21) ఉన్నాడు. గత నెల 31వ తేదీ సాయంత్రం 6.45 గంటల సమయంలో తండ్రి ప్రభాకర్‌రెడ్డికి ఫోన్ చేసిన అతను స్ప్లెండర్ బైక్ (టీఎస్08ఎఫ్ఎం8520)ను కంపెనీ ఎదుట పార్కు చేశానని, తాళం చేవి కంపెనీలో పనిచేసే వెంకటేష్‌కు ఇచ్చానని చెప్పాడు. కాగా రాత్రి 8 గంటలకు ఇంటికి చేరుకున్న ప్రభాకర్‌రెడ్డికి కుమారుడు కనిపించలేదు. అతని మొబైల్ ఫోన్లకు ప్రయత్నించగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు కుమారుడి జాడ కోసం పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ప్రభాకర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దూలపల్లిల్లో..



పల్లవి(ఫైల్)

కుత్బుల్లాపూర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దూలపల్లికి చెందిన డప్పు ఉమేష్ మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. కాగా ఈనెల 5వ తేదీ రాత్రి 8.30 గంటల సమయంలో ఉమేష్ పనిమీద బయటకు వెళ్లగా ఇంట్లో అతని భార్య పల్లవి (29), పిల్లలు ఉన్నారు. అయితే రాత్రి 11.40 గంటలకు ఇంటికి రాగా భార్య కనిపించలేదు. ఈ విషయమై పిల్లలను ఆరా తీయగా హాస్పటల్‌కు వెళ్లిందని చెప్పారు. ఆమెకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. పల్లవి జాడ కనిపించకపోవడంతో మంగళవారం భర్త ఉమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హామీలు నెరవేర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం



మరాఠీబస్తీలో హాత్‌సే హాత్ జోడో కరపత్రాన్ని అందజేస్తున్న కొలన్ హన్మంతరెడ్డి

సుభాష్‌నగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మోసపూరిత హామీలతో ప్రజలు నష్టపోతున్నారని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. మంగళవారం సుభాష్‌నగర్ డివిజన్ తెలుగుతల్లి నగర్, మరాఠీ బస్తీ, మైత్రినగర్ ప్రాంతాల్లో హన్మంత్‌రెడ్డి హాత్ సే హాత్ జోడో పాదయాత్ర చేపట్టారు. గడప గడపకు హాత్ సే హాత్ జోడో అభియాన్ స్టిక్కర్ వేసి కరపత్రాలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేసీఆర్ నిరంకుశ పాలన సాగిస్తున్నారని అన్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చడంలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని బలపరిచి గెలిపించాలని కోరారు.

ఇంటింటికీ బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలు

బాలానగర్: హాత్‌సే హాత్ జోడో యాత్రను మంగళవారం బాలానగర్‌లోని సాయినగర్, నవజీవన్‌నగర్, వినాయక్‌నగర్, గీతనగర్ సెయింట్ మార్టిన్ స్కూలు నుంచి టీపీసీసీ సభ్యుడు డా. సత్యం శ్రీరంగం చేపట్టారు. రాహుల్ గాంధీ సందేశాలను.. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను తెలియజేసే కరపత్రాలను ఇంటింటికి వెళ్లి అందజేశారు. భారత్ జోడో యాత్ర ముఖ్య ఉద్దేశాన్ని ప్రజలకు తెలియజేస్తూ ముందుకెళ్తున్నామని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు చేసిన సంక్షేమాన్ని వివరిస్తున్నామని తెలిపారు. రాబోయే కాలంలో అధికారంలోకి వస్తే ప్రజలకు మంచి చేస్తామని హామీ ఇస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పుష్పారెడ్డి, ఏ–బ్లాక్ అధ్యక్షుడు పి.నాగిరెడ్డి, మధుమోహన్, నవీన్‌గౌడ్, మల్లేష్, యాదగిరి, క్రిష్ణారాజ్‌పుత్, మధుగౌడ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి చేయూత



వెంకటేష్‌గౌడ్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న మన్నె రాజు

సుభాష్‌నగర్: చదువు, క్రీడల్లో రాణించే పేద విద్యార్థులకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మన్నె రాజు అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్ సాయిబాబా నగర్‌కు చెందిన వెంకటేష్‌గౌడ్ కరాటే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. తండ్రి లేని అతడి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండటంతో విషయం తెలుసుకున్న మన్నె రాజు మంగళవారం విమాన చార్జీలు, ఇతర ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశాడు.

చేసే సహాయం చిన్నదైనా గొప్పదే..



వెంకటేష్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

జీడిమెట్ల: మనం చేసే చిన్న సహాయమైన గొప్పదేనని విప్లవజ్యోతి అల్లూరి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొట్టిముక్కల సత్యనారాయణ రాజు అన్నారు. సూరారానికి చెందిన ఇంటర్ సెకండియర్ చదువుతున్న వెంకటేష్‌గౌడ్ జాతీయ స్థాయి కరాటే పోటీలకు డెహ్రాడూన్ వెళ్లడానికి డబ్బులు లేక ఆగిపోయాడు. విషయం తెలుసుకున్న ఫౌండేషన్ సభ్యులు వెంటనే వెంకటేష్‌కు రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. వెంకటేష్ ఇదివరకే జాతీయస్థాయిలో 6 బంగారు పతకాలు, 4 వెండి పతకాలు, 3 రజత పతకాలు సాధించాడని తెలిపారు. ఇంకా ఎవరైనా వెంకటేష్‌కు సహాయం చేయాలనుకుంటే 63037 59221కు గూగుల్‌పే లేదా ఫోన్ పే చేయాలన్నారు. ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు జంగా తాతాజీ, ప్రధాన కార్యదర్శి చింతకింది నాగరాజు, సభ్యులు ప్రభాకర్ శర్మ, దొరబాబు పాల్గొన్నారు.

సురేష్ హత్య కేసులో భార్యే హంతకురాలా?



సంతోష్ (ఫైల్)

జీడిమెట్ల: సురేష్ దారుణ హత్య కేసులో జీడిమెట్ల పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. సంజయ్ గాంధీ నగర్‌కు చెందిన సురేష్(28) ఆదివారం రాత్రి బయటకు వెళ్లాడు. సోమవారం తెల్లవారు జామున గోనె సంచిలో అతడి మృతదేహం ప్రత్యక్షమయ్యింది. అతడి ఇంటి ముందే లభించిన సురేష్ మృతదేహం గాయాలు ఉన్నాయి. ముఖంపై గాయాలతోపాటు మెడకు ఉరి బిగించి హత్య చేసినట్లు పోలీసులు ఆధారాలు సేకరించారు. సంతోష్ ఆదివారం తినుబండారాలు తీసుకురావడానికి బయటకు వెళ్లాడని అతడి భార్య చెప్పిన మాటలే పోలీసులకు భార్య రేణుకపై అనుమానం కలిగించాయి.

మరి సహకరించింది ఎవరు?

సురేష్ హత్య కేసులో భార్య రేణుకే హంతకురాలిగా పోలీసులు బలంగా విశ్వసిస్తూ ఆమెను సోమవారమే అదుపులోకి తీసుకున్నారు. సురేష్ ఉంటున్న ఇంట్లో సురేష్‌తో పాటు భార్య రేణుక, వారి ఇద్దరు పిల్లలు, మరో బాలిక ఉంటున్నట్లు సమాచారం. రేణుక భర్తను హత్య చేసేందుకు సహకరించింది ఎవరు? హత్యకు గల కారణాలు ఏమిటని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సంతోష్ హత్య కేసులో నిజానిజాలు తేల్చి బుధవారం పోలీసులు ప్రెస్‌మీట్ పెట్టనున్నట్లుగా సమాచారం.

సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నాం

ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు



ఎమ్మెల్సీకి జాతర ఆహ్వాన పత్రికను అందజేస్తున్న సూరారం కట్టమైసమ్మ ఆలయ కమిటీ సభ్యులు

దుండిగల్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు అన్నారు. మంగళవారం శంభీపూర్‌లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు స్థానిక సమస్యలపై ఆయనకు వినతి పత్రాలు అందజేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్సీ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. శుభకార్యాలకు రావాల్సిందిగా కోరుతూ పలువురు ఆహ్వాన పత్రికలను అందజేశారు.

కట్టమైసమ్మ జాతర ఏర్పాట్లపై సమావేశం..

- ఈనెల 12న సూరారం కట్టమైసమ్మ జాతర నేపథ్యంలో ఏర్పాట్ల విషయమై ఆలయ కమిటీ సభ్యులతో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని విభాగాల అధికారులతో మాట్లాడతానని అన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగకుండా మళ్లించే విధంగా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, నాయకులు బాలేష్, శ్రీనివాస్ రెడ్డి, వారాల వినోద్, సురేష్, రమేష్ గౌడ్, వీరారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, సూరారం గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీల సమస్యలు పరిష్కరించాలని వినతి

- గాజులరామారం సర్కిల్‌కు చెందిన రిసోర్స్ పర్సన్స్ (ఆర్పీలు) ఎమ్మెల్సీని కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్సీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, సురేష్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, రిసోర్స్‌పర్సన్స్ యూనియన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజుకు సమస్యలపై వినతి పత్రం అందజేస్తున్న రిసోర్స్ పర్సన్లు

గిరిజన ఉపాధ్యాయ సంఘం డైరీ, కేలండర్ ఆవిష్కరణ

తెలంగాణ రాష్ట్ర గిరిజన ఉపాధ్యాయ సంఘం మేడ్చల్‌జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీ, కేలండర్‌ను ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు రమేష్ రాథోడ్, కార్యదర్శులు ధనరాజ్, రాజు, గోప్యా నాయక్, కిషన్ నాయక్, ఎం.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.